ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 7
సంపుటి : 3
సంచిక : 63

సోమవారం 5 ఆగస్టు 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



## న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి రేవంత్..

అమెరికా చేరిన రేవంత్
న్యూయార్క్‌లో సీఎంకు
ఘన స్వాగతం

పెట్టుబడులే లక్ష్యంగా భేటీలు

రాష్ట్రాన్ని గొప్పగా
అభివృద్ధి చేయడమే
మనందరి కల: సీఎం

హైదరాబాద్, ఆగస్టు 4 : తెలంగాణ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా వెళ్లిన ముఖ్యమంత్రి

మిగతా 2 లో



## కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ..

### తిహాడ్‌లో ఆమెతో కేటీఆర్, హరీశ్‌రావు ములాఖత్ కూడా నేడే

న్యూఢిల్లీ, ఆగస్టు 4 : ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది. ఆమెను మార్చి 15న తొలుత ఈడీ, అనంతరం ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను

మిగతా 2 లో

## ముచ్చర్ల ఫోర్త్ సిటీ వెనుక

# భూకుంభకోణం..

### వేల ఎకరాలను సేకరించి దోచుకునే కుట్ర

ధరణిపై భూముల అన్యాక్రాంతం
పై శ్వేత పత్రం విడుద చేయండి

ధరణిపై వేసిన కమిటీ ఏం
తేల్చిందని నిలదీత

బీఆర్ఎస్ బాటలోనే
కాంగ్రెస్ నడుస్తోంది

బీఆర్ఎస్ కు పట్టిన
గతే కాంగ్రెస్ కు పడుతుంది

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి
బండి సంజయ్ కుమార్ ఫైర్

గుర్రంగూడలో బోనాల ఉత్సవాల్లో
పాల్గొన్న బండి సంజయ్



కాంగ్రెస్ ప్రభుత్వం 'ఫోర్త్ సిటీ' పేరు తో చేసిన ప్రకటన వెనుక పెద్ద ఎత్తు న భూదందా కొనసాగుతోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధి లో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి రియల్ ఎస్టే ట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తుల ను పోగేసుకునేందుకు సిద్ధమ య్యారని అన్నారు.ధరణి పేరుతో దాదాపు రూ.2 లక్షల కోట్ల స్కాం జరిగిందన్నారు. దేశంలోనే అతిపెద్ద స్కాం ధరణి అని పేర్కొన్న బండి సంజయ్ కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తూ వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధమైందన్నారు.

హైదరాబాద్: ఆదివారం మహే శ్వరం నియోజకవర్గంలోని గుర్రం గూడలో బోనాల ఉత్సవాలకు హాజరైన బండి సంజయ్ కుమార్ చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. తెలంగాణ అక్కాచెల్లెళ్లు, అన్నద మ్ములకు మా ఆడబిడ్డలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు బోనాల పండుగ

మిగతా 2 లో

## రేషన్‌కు, సంక్షేమ పథకాలకు వేర్వేరు కార్డులు

### త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 4 : చౌక దుకాణాల్లో రేషన్ తీసుకునేందుకు, సంక్షేమ పథకాలను పొందేందుకు వేర్వేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సచివాలయంలో

మిగతా 2 లో




## వయనాడ్‌లో 365కు పెరిగిన మరణాలు

### ఇంకా 206 మంది గల్లంతు

వయనాడ్, ఆగస్టు 4: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ విషాదంలో మృతుల సంఖ్య 365కు చేరుకున్నట్లు అధికారులు ప్రకటించారు. మృతుల్లో 30 మంది చిన్నారులున్నారు. మరో 206 మంది గల్లంతయ్యారని, వారిని వెతికేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఆరో రోజు సహాయక చర్యల్లోనూ మృతదేహాలు లభ్యమవుతున్నాయే తప్ప.. సజీవంగా ఎవరూ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 148 మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. గాలింపు

మిగతా 2 లో





## కారం మెతుకులతో కడుపు నింపుకోవాలా?

సర్కారీ బడి పిల్లల
గతి ఇంతేనా?

బిల్లుల పెండింగ్
వల్లే దుస్థితి: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 4 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కారం మెతుకులతో కడుపు నింపుకోవాల్సిందేనా.. మధ్యాహ్న భోజనంలో ఏం పెడుతున్నారు.. పిల్లలకు అందించే మెనూపై ప్రభుత్వం స్పందించాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం

మిగతా 2 లో



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ విషెస్

### భారీ పెట్టుబడులతో తిరిగి రావాలని ఆకాంక్ష

హైదరాబాద్ : పెట్టుబడుల ఆకర్షణ కోసం అమెరికా తో పాటు దక్షిణ కొరియాలో పర్యటించేందుకు బయలుదేరి వెళ్లిన తెలంగాణ ప్రతినిధి బృందానికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో భారీ ప్రతినిధి బృందం పెట్టుబడుల కోసం బయలుదేరిన నేపథ్యంలో

మిగతా 2 లో

## బంగ్లాదేశ్‌లో మళ్లీ రక్తపాతం

అల్లర్లలో 93 మంది మృతి

వందలాది మందికి తీవ్ర గాయాలు

ప్రధాని షేక్ హసీనా రాజీనామా
డిమాండ్‌తో విద్యార్థుల నిరసనలు

93 మంది మృతి, వందలాది
మందికి గాయాలు

ఢాకా, ఆగస్టు 4 : బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. ప్రధాన మంత్రి షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాలనే ఏకైక డిమాండ్‌తో విద్యార్థులు చేపట్టిన సహాయ నిరాకరణ

మిగతా 2 లో



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
5 ఆగస్టు
2024





# ముచ్చర్ల ఫోర్త్ సిటీ వెనుక భూకుంభకోణం..



## మొదటి పేజీ తరువాయి

వెనుక పెద్ద చరిత్ర ఉంది. బోనం పండుగకు సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది. కానీ ఇంత పెద్ద పండుగకు ప్రభుత్వం నిధు లివ్వదు. హిందువుల పం డుగలకు పైసలివ్వ రు. సెక్యులరిజం పేరుతో ఒక మతానికే కొమ్ముకాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తోంది. రంజాన్ కు రూ.33 కోట్లు, హిందు వులను చంపిన తబ్లిగీ జమాతే సంస్థకు 2 కోట్ల 40 లక్షలు విడుదల చేసిన కాంగ్రెస్ అదేదో ఘన కార్యం గా చెప్పుకోవడం సిగ్గు చేటు. హిందువుల పండుగలంటే అంత చులకనా? బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా ఎంఐఎం పార్టీకి కొమ్ము కాస్తోంది. ఈ విషయంపై మాట్లాడితే నాపై మతతత్వ ముద్ర వేయాలని చూస్తున్నరు. ఇట్లనే వ్యవహరిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పట్టడం ఖాయం. ఎంఐఎం పార్టీని నమ్మకుంటే కాంగ్రెస్ నేతలు నట్టేట మునగడం ఖాయం. 15 నిమిషాలపాటు సమయమిస్తే హిందువులను నరికి చంపుతానన్న అక్బరుద్దీన్ ఒవైసీని తీసుకెళ్లి కొడంగల్ లో పోటీ చేయిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించడం సిగ్గు చేటు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు ఆలోచించాలి. నిరంతరం బీజేపీని విమర్శించడం మానుకోవాలి. కేంద్రంతో సమన్వయంతో వ్యవహరించాలి. తెలంగాణ అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం. కలిసికట్టుగా పనిచేసి నిధులు తీసుకొద్దాం. అంతే తప్ప ప్రధానమంత్రిని అదే పనిగా తిట్టడంవల్ల నష్టమే తప్ప లాభం లేదనే అంశాన్ని గుర్తుంచుకోవాలి.

మహేశ్వరం ను ఫోర్త్ సిటీగా మారుస్తామనే సర్కార్ ప్రకటన వెనుక పెద్ద భూదందా నడుస్తోంది. కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను అగ్గువకు కొని ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నరు. బీఆర్ఎస్ మాదిరిగానే భూదందాతో వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు ఫోర్త్ సిటీ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. దీనివల్ల కాంగ్రెస్ నేతలకు తప్ప ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదు పెద్ద ఎత్తున ఆస్తులు సంపాదించేందుకు భూ దందాను తెరపైకి తేవడమే కాకుండా మహేశ్వరం కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకుడికే భూములను సేకరించే బాధ్యతను అప్పగించారు.

రుణమాఫీ ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్య గత ప్రభుత్వ హయాంలోనే 36 లక్షల మంది ఉంటే లక్షన్నర లోపు రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 18 లక్షలు దాటకపోవడం విడ్డూరం. అంటే నూటికి 70 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలే ఒకవైపు బ్యాంకుల్లో వడ్డీలు పెరిగి, బయట చేసిన అప్పులు తీరక, పెట్టుబడికి పైసల్లేక రైతులు అల్లాడుతుంటే ఈ ప్రభుత్వం మాత్రం గొప్పలు చెబుతోంది. రుణమాఫీతోపాటు 6 గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేసేందుకు కాంగ్రెస్ నేతలకు ఏదో ఒక కొత్త అంశాన్ని తెరపైకి తీసుకురావడం, ప్రజల దృష్టిని మళ్లించడం అలవాటైపోయింది. రాబోయే స్థానిక సంస్థల్లో గెలిచేందుకు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. రుణమాఫీ సహా 6 గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులుసహా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీ పోరుబాటకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కార్యచరణ రడీ అవుతోంది.

ధరణి పేరును భూమాతగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం....భూమాతను భూమేతకు ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద స్కాం జరిగింది. తెలంగాణ ఏర్పడిన 2014 నాటికి రాష్ట్రంలో 24 లక్షల అసైన్డ్ భూములుంటే నేడు ఆ భూములు ఐదు లక్షలకు ఎలా తగ్గాయి. అసైన్డ్ భూములను, శిఖం భూములను, దేవాదయ, అటవీ, భూదాన భూములతోపాటు పేదల భూములను కూడా ధరణి పేరుతో బీఆర్ఎస్ లీడర్లు దండుకున్నరు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వివరాలేవి? వాటిని ఎందుకని రేవంత్ సర్కారు బయట పెట్టడం లేదు. ఆ భూముల విలువ రెండు లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుంద. కేసిఆర్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ధరణిని అడ్డుపెట్టుకుని దోచుకున్నారని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదు? అధికారంలోకి రాగానే ధరణిపై ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక ఏది? ధరణి పేరుతో దోపిడీ చేసిన దోషులెవరో ఎందుకు తేల్చడం లేదు? ధరణిపై వేసిన కమిటీ బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ నేతలు ఏ విధంగా దోచుకోవాలా? అనే అంశంపై రహస్య నివేదిక ఇచ్చినట్లుంది. అందుకే ఫోర్త్ సిటీ, భూమాత పేరుతో భూములను దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే భవిష్యత్తులో గజం భూమి కూడా మిగిలే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ధరణి భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయాలి.

గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డు.. వీటన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయాలనే ప్రతిపాదన అర్థం లేనిది. ప్రజలపై పన్నుల భారం మోపేందుకే విలీన కుట్ర చేస్తున్నారు. 15 ఏళ్ల కిందట హైదరాబాద్ శివారులోని విలీనమైన ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. వాటిని అభివృద్ధి చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలను విలీనం చేస్తామనడం అర్థం లేనిది. దీనిపై బీజేపీ నాయకత్వం చర్చించి తగిన కార్యాచరణను ప్రకటిస్తుంది.





# న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి రేవంత్..

## మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నానికి న్యూయార్క్ నగరానికి చేరుకున్నారు. న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో రేవంత్ బృందానికి ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ బృందం పర్యటిస్తోంది.

10 రోజుల పాటు అమెరికా, దక్షిణకొరియాలో వివిధ నగరాల్లోని ప్రభుత్వ పెద్దలు, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చల్లో బృందం పాల్గొననుంది. వారితో చర్చించి, రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టాలని ఆహ్వానించనున్నారు. సీఎం రేవంత్ వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. కాగా "కీలకమైన న్యూయార్క్ నగరం నుంచే పెట్టుబడుల సాధన పర్యటన ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నాను.

ప్రవాస భారతీయులైన ఇక్కడి మన తెలుగు సోదరసోదరీ మణులు గుండెల నిండా ప్రేమ, ఆప్యాయలతో మాకు స్వాగతం పలకడానికి వచ్చారు. మనందరినీ ఏకం చేసే కల.. తెలంగాణను మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవడం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో ట్వీట్ చేసింది.

# కారం మెతుకులతో కడుపు నింపుకోవాలా?

## మొదటి పేజీ తరువాయి

సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం తిని కడుపు నింపుకొన్నారని ఓ ఫోటోను ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు.



విద్యార్థులకు పౌష్టికాహారం కోసం అందించే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం, ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలోనూ విఫలమైందన్నారు. భోజన సామగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండడంవల్ల విద్యార్థులకు సరైన భోజనం అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని హరీశ్ రావు కోరారు.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ విషెస్

## మొదటి పేజీ తరువాయి

పెట్టుబడుల ఆకర్షణలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. గత పది సంవత్సరాలలో ఉత్తమ ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక మల్టీ నేషనల్ కంపెనీలు ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్ కి తీసుకు రాగలిగామని, ఈ సందర్భంగా ఆయా కంపెనీలతో తెలంగాణకు ప్రత్యేక అనుబంధం ఏర్పరచగలిగి గమన్నారు.తెలంగాణలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనేక దిగ్గజ కంపెనీలతో రాష్ట్రంలో బల మైన వ్యాపార బంధాన్ని ఏర్పరచగ లిగామన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఉన్న అద్భుతమైన వ్యాపార వాణిజ్య విధానాలు, టీఎస్ ఐపాస్ వంటి అనుమతుల ప్రక్రియ వంటి వాటి వలన ఇప్పటికే తెలంగాణకు తాము తీసుకువచ్చిన కంపెనీలు తమ విస్తరణ ప్రణాళికలో కూడా తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో 10 సంవత్సరాలలో పాలసీలపరమైన విప్లవాత్మక నిర్ణ యాలతో పాటు, మౌలిక వసతుల కల్పన ద్వారా తెలంగాణకు పెట్టు బడుల ఆకర్షణలో ప్రత్యేక స్థానాన్ని కల్పించగలిగామన్నారు. గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రా నికి నాలుగు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకురావ డంలో పాటు 24 లక్షల ఉపాధి అవకా శాలను ప్రైవేటు రంగంలో సృష్టించ గలిగామన్నారు.ముఖ్యమంత్రి ప్రతి నిధి బృందం ఇలాంటి కంపెనీలతో మరోసారి చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, కేటీఆర్ తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆకాంక్షించారు. తమ పార్టీకి రాజకీయాలకు అతీతంగా కేవలం తెలం గాణనే తమ ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుందని తెలిపిన కేటీఆర్, ప్రస్తు త ప్రభుత్వం తాము దశాబ్ద కాలం గా నిర్మించిన బలమైన పెట్టుబడుల పునాదులపైన మరిన్ని ఉపాధి అవ కాశాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ రక్తపాతం



## మొదటి పేజీ తరువాయి

ఉద్యమం తొలి రోజు, ఆదివారం దేశ వ్యాప్తంగా రక్తపాతానికి దారి తీసింది. విద్యార్థులు, అధికార అవామీ లీగ్ పార్టీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణల్లో దేశ వ్యాప్తంగా ఇప్పటిదాకా 14 మంది పోలీసులు సహా 93 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో అప్రమత్తమైన హోం శాఖ ఆదివారం సాయంత్రం నుంచి దేశ వ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూను అమలుకు అంతేకాక, ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సేవలను దేశ వ్యాప్తంగా తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే, 4జీ సేవలను కూడా ఆపేయాలని మొబైల్ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదేశించింది. ప్రధాని హసీనా చర్చలకు ఆహ్వానించినా ఆమెతో మాట్లాడేందుకు ఆందోళనకారులు తిరస్కరించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై జరిగిన నిరసనల్లో ఇటీవల 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాలకు బాధ్యత వహిస్తూ ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌తో విద్యార్థులు ఉద్యమబాట పట్టారు.

దేశ వ్యాప్తంగా హింస చెలరేగడంపై స్పందించిన ప్రధాని హసీనా షేక్.. విద్యార్థుల ముసుగులో టెర్రరిస్టులు హింసకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, హింసకు పాల్పడుతున్నవారిని అణిచి వేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్మీ, నేవీ, వాయుసేన చీఫ్‌లు, పోలీసు విభాగాల ఉన్నతాధికారులతో హసీనా సమావేశమయ్యారు.

# 'గుట్ట'పై పుణ్య స్నానాలకు ఓకే..

**11 నుంచి అందుబాటులోకి విష్ణు పుష్కరిణి..**
**దంపతులు, భక్తులకు రూ.500 టిక్కెట్**
**గిరి ప్రదక్షిణ భక్తులకు ఉచిత ప్రవేశం.. టికెట్ తీసుకోనివారు నీళ్లు చల్లుకోవచ్చు**

యాదాద్రి, ఆగస్టు 4 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో పాత ఆచారాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 11 నుంచి కొండపై ఉన్న విష్ణు పుష్కరిణిలో స్నానం చేసేందుకు అనుమతిస్తోంది. ఇందుకోసం దంపతులు, భక్తులకు రూ.500 టికెట్ ధర నిర్ణయించి ఆర్జిత సేవల జాబితాలో చేర్చనుంది. స్వామివారిని దర్శించుకునే భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి(కొండపైన గుండం)లో స్నానం ఆచరించడం ఆచారంగా వచ్చేది.

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండ కింద లక్ష్మీ పుష్కరిణిని ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం కొండపైన ఉన్న విష్ణు పుష్కరిణిని స్వామివారి కైంకర్యాల కోసం మాత్రమే వినియోగిస్తున్నారు. సంతానం కలగని దంపతులు స్వామివారి సన్నిధిలోని విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం చేసిన పక్షంలో సంతానం కలుగుతుందని విశ్వాసం. ఆ ఆచారాన్ని పునరుద్ధరించి విష్ణు పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు అవకాశం కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పుష్కరిణిలో నీటిని నింపి ఈ నెల 11న స్వాతి నక్షత్రం రోజున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులోకి తేనున్నారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు విష్ణు పుష్కరిణిలో ఉచితంగా స్నానాలు ఆచరించేందుకు అనుమతిస్తున్నట్లు ఈవో తెలిపారు. గిరి ప్రదక్షిణ చేయని, టికెట్ కొనుగోలు చేయని భక్తులు పుష్కరిణి నీటిని తలపై చల్లుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణిలోకి చెత్తాచెదారం చేరకుండా, కోతులు దూకకుండా, భక్తులకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు.. స్నానం ఆచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయనున్నారు.

### పాత ఆచారాల పునరుద్ధరణ..

కొండపైన రాత్రి బస చేసేందుకు డార్మెటరీ హాల్, కొబ్బరికాయలు కొట్టే స్థలం, గిరి ప్రదక్షిణ వంటి పాత ఆచారాలను ఇప్పటికే పునరుద్ధరించారు. 2016లో గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణం చేపట్టగా.. కొండపైన ఇతర నిర్మాణాలు లేకుండా వైటీడీఏ మాస్టర్ ప్లాన్‌లో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ఉద్ఘాటన త్వాత కొండపైన పాత ఆచారాలను అధికారులు రద్దు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాత ఆచారాల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు.

# రేషన్‌కు, సంక్షేమ పథకాలకు వేర్వేరు కార్డులు

## మొదటి పేజీ తరువాయి

ఆదివారం ప్రజావాణి ఫిర్యాదులపై జరిగిన సమీక్ష సందర్భంగా.. ప్రజావాణికి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పందిస్తూ రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాగే కొత్త పెన్షన్లనూ త్వరలో మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్క్‌లను బలోపేతం చేసేలా చర్యలు చేపడితే సీఎంఆర్ఎఫ‌కు సంబంధించి ఫిర్యాదులు తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు. ప్రజావాణి విభాగంలో పని చేసేందుకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలని అధికారులు కోరగా.. తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎంచెప్పారు. ప్రజావాణి పనితీరుపై మూడు నెలకోసారి సమీక్ష నిర్వహిస్తానన్నారు.

### మార్చి కల్లా యాదాద్రిలో విద్యుదుత్పత్తి

వచ్చే మార్చికల్లా ఎట్టి పరిస్థితుల్లో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరిగి తీరాల్సిందేనని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిపై సచివాలయంలో జెన్‌కో అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. యాదాద్రి నాలుగు యూనిట్లనూ దశల వారీగా వచ్చే మార్చి కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు.. అందుబాటులో ఉన్న స్థలాల్లో 20 సమీకృత గురుకుల సముదాయాలను నిర్మించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. సచివాల యంలో ఆయన విద్యాశాఖ, ఆర్అండ్‌బీ, ప్రైవేటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో గురుకులాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. తొలిదశ నిర్మాణా లు వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తికావాలన్నారు.

# కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ..

## మొదటి పేజీ తరువాయి

గతంలోనే ట్రయల్ కోర్ట్ట కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై 22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారాని(ఆగస్టు 5)కి వాయిదా వేశారు. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు కేటీఆర్, హరీశ్‌రావు సోమవారం కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

### ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

తమ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. దీనిపై న్యాయ నిపుణులతో చర్చించేందుకు కేటీఆర్, హరీశ్‌రావులు శనివారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులను కలిసి సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. హైకోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడాలా? లేక సుప్రీంకోర్టును ఆశ్రయించాలా? అనే దానిపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# వయనాడ్‌లో 365కు పెరిగిన మరణాలు

## మొదటి పేజీ తరువాయి

చర్యలను సోమవారంతో ముగిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. 93 పునరావాస కేంద్రాల్లో 10 వేల మంది ఆశ్రయం పొందుతున్నారన్నారు.

కాగా.. కేరళలో వరద, భారీ వర్షాలు ఇంకా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం సూచిపారా ప్రాంతంలో వరదలో చిక్కుకుపోయిన ఐదుగురు వ్యక్తులను కాపాడినట్లు వాయుసేన తెలిపింది. వయనాడ్ విషాదం గురించి పోలీసులు, అగ్నిమాపక శాఖ, విపత్తు నిర్వహణ విభాగాలకు తొలుత సమాచారం అందించిన మహిళ నీతూ జోజో కూడా వరదలో కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించడం సాధ్యం కాదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ అన్నారు. కేంద్ర మంత్రి సురేశ్ గోపీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే.. కేంద్రం అవసరమైన సాయాన్ని అందజేస్తుందని వీరిద్దరూ చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
5 ఆగస్టు
2024





# జెండర్ ఈక్వాలిటీ కోసం ఎస్.వీ.ఎన్ కంకణం

## విద్యార్థుల్లో మొదట మార్పు రావాలని వారితోనే ప్రదర్శనలు







యాదగిరిగుట్ట, ఆగస్టు 4 (రోమింగ్ న్యూస్): విద్యార్థులకు ఎప్పుడూ మార్కుల గొడవనే కాకుండా సమాజ స్థితిగతులను కూడా అవగాహన పరిచేందుకు యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ నడుం బిగించింది. తమ స్కూల్ విద్యార్థులను తీసుకొని గ్రామాల్లోకి వెళుతూ మొదటగా జెండర్ ఈక్వాలిటీ కోసం కసరత్తు ప్రారంభించింది. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజల చైతన్యం కోసం నడుం బిగించింది. అమ్మాయి అబ్బాయి అనే తేడా లేకుండా వారి ఆలోచనలు మార్పు తీసుకురావాలన్న సంకల్పానికి శ్రీకారం పలికింది. ఇప్పటికీ అమ్మాయి, అబ్బాయి అనే వివక్ష గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా ఉన్నదని, దీన్ని నివారించాలన్న ఉద్దేశంతో ప్రజల చైతన్యం కోసం స్వచ్ఛందంగా స్కిట్ లను రూపొందించి వీధులలో ప్రదర్శించే కార్యక్రమానికి శ్రీకారం పలికింది. ఎస్.వీ.ఎన్ అకాడమీక్ డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్ ఆధ్వర్యంలో తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల లో జెండర్ ఈక్వాలిటీ ప్రాధాన్యతను వివరించే స్కిట్ లను ప్రదర్శించారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని ప్రజలను కూడా ఇన్వాల్వ్ చేశారు. ఆడపిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా వేదికలపై నుంచి మాట్లాడించారు. ఫలితంగా అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా తాము చాలా సంతోషంగా పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తున్నామని ఎస్.వీ.ఎన్ ఎంతో చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయా గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఆడపిల్ల పుడితే ఆమెకు పెళ్లి... పిల్లలు ఇలా చాలా బాధ్యతలు ఉంటాయని ఓ ఇంటికి పంపే వరకు చాలా కేర్ తో చూసుకోవాల్సి ఉంటుందని ధోరణి కూడా చాలామంది తల్లిదండ్రుల్లో ఉన్న విషయాన్ని విద్యార్థులు తమ స్కిట్ ద్వారా ప్రదర్శించారు. అంతేకాకుండా మగ పిల్లవాడు పుట్టగానే వంశోద్ధారకుడు పుట్టాడని తెగ సంబరపడిపోయే కుటుంబాల ఆలోచనలను కూడా వారు తమ ప్రదర్శనలో వివరించారు. ఆడపిల్ల పుట్టిందనేసరికి ఒకంత డీలా పడిపోయే సన్నివేశాలను ఆసక్తిగా

**జెండర్ ఈక్వాలిటీ కోసం స్టూడెంట్స్ తో ప్రత్యేక స్కిట్ లను రూపొందించిన డైరెక్టర్ వృతిక్**

**వెంకటాపూర్ ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఆకట్టుకున్న జెండర్ ఈక్వాలిటీ ప్రదర్శనలు**

**ఎస్.వీ.ఎన్ ప్రయత్నాన్ని ప్రశంసించిన గ్రామస్తులు**

**ఎస్.వీ.ఎన్ స్టూడెంట్స్ హావభావాలకు ముగ్ధులైన గ్రామస్తులు**

చిన్నారులు ఉత్తమ అభినయం ద్వారా ప్రజలకు అర్థమయ్యే తీరులో వ్యక్తం చేశారు. ఇలా ఎందుకు ఆలోచిస్తున్నామన్నది ప్రజల్లో రావాలని ఆ సంకల్పాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. పూర్వపు రోజుల్లో ఆడవారికి పరిమితులు ఉండేవి... ఈ పనులు మాత్రమే చేయగలరని ఆలోచనలు ఉండేవి. అదే మగ పిల్లవాడి విషయానికి వచ్చేసరికి కుటుంబాన్ని పోషిస్తాడని, బాధ్యతలను పంచుకుంటాడని ఆలోచించేవారు. అదే ధోరణి ఇప్పటికీ చాలా చోట్ల చూస్తున్నాం... అయితే ఇక్కడ నాగరికత మారిందని రోదసిలోకి కూడా మహిళలు వెళ్లగలుగుతున్నారనే విషయాన్ని విద్యార్థులు స్కిట్ లో చూపించారు. నాడు కల్పనా చావ్లా.. నేడు సునీత విలియం రోదసిలో గడిపిన విషయంతో పాటు ఎయిర్ పైలట్లుగా, బార్డర్ సెక్యూరిటీ ఫోర్సులో పనిచేస్తూ దేశ రక్షణలో మహిళలు భాగస్వామ్యం వహిస్తున్న విషయాన్ని చెప్పగలిగారు. అయితే ఆడపిల్లపై వివక్ష మంచిది కాదని ఇలాంటి ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండకూడదని విద్యార్థులు తమ స్కిట్ లో చూపించారు. తల్లిదండ్రుల్లో ఈ ధోరణి మారాలన్న సంకల్పంతో ఎస్.వీ.ఎన్ డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్ ఆలోచనలో నుంచి ఈ కార్యక్రమం రూపొందింది. చిన్నతనం నుండి పిల్లలకు స్త్రీ, పురుష సమానత్వం గురించి తెలియపరచాలని స్కిట్లను ఏర్పాటు చేశారు. స్త్రీ పురుష సమానత్వం వల్ల కలిగే లాభాలను కూడా వారు తమ ప్రదర్శనలు వివరిస్తున్నారు. పెరిగేకొద్దీ పిల్లలు లింగ వివక్షత అనే పదానికి దూరంగా ఉండే విధంగా తమ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా వివరించారు. సమానత్వం అనే విషయం గురించి మాటల్లో చెబితే అర్థం కాకపోవచ్చు... పాటించకపోవచ్చు అందుకే ఇంట్లో తల్లిదండ్రులు సమానత్వం అనే విషయాన్ని అనుసరిస్తూ పిల్లల్ని ప్రేరేపించాలనే భావన కలిగే విధంగా విద్యార్థులు తమ ప్రదర్శనలో పేర్కొన్నారు. ఆడపిల్ల, మగ పిల్లవాడని తేడా చూపకుండా ఇద్దరినీ సమానంగా చూసినప్పుడు వారిలో లింగ వివక్ష అనే భావన కలగదని ఆ విధమైనటువంటి భావన వచ్చే విధంగా తల్లిదండ్రులు చూపాలని చిన్నారులు తమ ప్రదర్శనలలో వివరించారు. ఒక ఇంట్లో అమ్మాయి అబ్బాయి ఉన్నట్లయితే అబ్బాయి ఆలస్యంగా నిద్రలేచినా ఎలాంటి ఫోర్సు చేయని తల్లి అదే అమ్మాయి నిద్ర లేవకపోతే ఏ విధంగా కోప్పడుతుందో హృదయానికి హత్తుకునే విధంగా ఎస్.వీ.ఎన్ చిన్నారులు ప్రదర్శనలలో చూపించారు.

ప్రతి పనిలోనూ అమ్మాయిలు అబ్బాయిలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

ఆడపిల్ల చేసే పనులు మగ పిల్లవాడు చేసే పనులు అంటూ విభజించి పనులను అప్పగించకూడదని సందేశాన్ని స్కిట్ లో చూపించారు. పనులతోనే స్త్రీ, పురుషులను వేరు చేయడం మొదలవుతుంది కాబట్టి మొదట దాన్ని దూరం చేయాలని, ఇంటి పని, వంట పని, బయట పనులను ఇద్దరు పిల్లల్ని భాగస్వామ్యం చేయాలని, ఇద్దరినీ ప్రతి పనిలోనూ భాగస్వామ్యం చేసి ప్రోత్సహించే బాధ్యత పేరెంట్స్ మీద మాత్రమే ఉంటుందని స్కిట్ ద్వారా వివరించారు.

అంతేకాకుండా పిల్లలతో చిన్న చర్చలు చేయాలి... దేశంలో జరుగుతున్న పరిస్థితుల గురించి వాటి కారణాలు పరిష్కారాల గురించి, వాటి కారణాలు , పరిష్కారాల గురించి ఆ చిన్ని మెదళ్లు ఏం చెప్తాయనేది విని కాస్త చర్చించాలి. చుట్టూ జరుగుతున్న విషయాల గురించి మాట్లాడాలి. ఇది వారికి ప్రతి విషయాన్ని గమనించే శక్తిని ఇస్తుందనేది ఇక్కడ వివరించారు. అదేవిధంగా పిల్లలకు గౌరవించడం నేర్పడం... తల్లిదండ్రులకు చాలా అవసరమనే విషయాన్ని కూడా స్కిట్లో చూపించారు. ఇంట్లో పెద్దవారిపట్ల ఎలా మసలుకోవాలి. వారిని ఎలా గౌరవించాలి... ఏదైనా నేర్పే ముందు చెప్పేముందు మనం ఆచరిస్తే దానిని సులువుగా పిల్లలు ఫాలో అవుతారు అనే విషయాన్ని స్కిట్లో చూపించారు. అదేవిధంగా వాళ్ళని ఏ విషయంలోను ఎప్పుడూ జడ్జ్ చేయకూడదని, విషయం పిల్లలకు సరైన మార్గదర్శకత్వంలో పెంచాలని సూచించారు.

ఎస్.వీ.ఎన్ గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం కోసం చేస్తున్న స్కిట్ ల తో ప్రదర్శన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జెండర్ ఈక్వాలిటీ కోసం చేస్తున్న ప్రయత్నాలను గ్రామస్తులు అభినందించారు.

వెంకటాపూర్ గ్రామానికి చెందిన నార నరసింహ మాట్లాడుతూ ఎస్.వీ.ఎన్ కేవలం డబ్బులు సంపాదించే విషయానికే ప్రాధాన్యత ఇవ్వకుండా పిల్లలు అన్ని రంగాల్లో ఎదగడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మూఢనమ్మకాలు... జెండర్ ఈక్వాలిటీకి సంబంధించిన విషయాన్ని విద్యార్థుల ద్వారా ఇలా చైతన్యం చేయడం ఇదే మొదలని, ఇది చాలా ప్రశంసనీయమని చెప్పారు. తమ ఇద్దరి తమకు ఇద్దరు ఆడపిల్లలేనని వారిద్దరిని ఎలాంటి వివక్ష లేకుండా పెంచుతున్నామని దీనికి ఎస్.వీ.ఎన్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపాల్ మాధురి, డైరెక్టర్ వృతిక్ లు ఎంతో సహకరిస్తున్నారని ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలువురు మహిళా పేరెంట్స్ కూడా ఈ సందర్భంగా పాఠశాల చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూ ప్రసంగాలు చేశారు. ఎస్.వీ.ఎన్ కు తాము రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వీ.ఎన్ ఉపాధ్యాయులు ఎం.డి. యూసుఫ్ ఎస్. నవీన్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.







### పేరెంట్స్ సమానత్వాన్ని ప్రోత్సహించాలి: డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్

సమానత్వం అనేది పిల్లల ఆలోచనలను నిలకడగా ఉండేలా చేస్తుందని అందుకే ఇంట్లో అన్ని విషయాలలో తమ పిల్లల్లో సమానత్వాన్ని ప్రోత్సహించాలని డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్ పిలుపునిచ్చారు. ఇంట్లో భార్యాభర్తలు ఎక్కువ, తక్కువ అనే విషయాన్ని వదిలేయాలని భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగస్తులు అయినా... కాకపోయినా ఎవరి పని వాళ్లు బాధ్యతగా చేయాలని ఆయన సూచించారు. ఒకరికి మరొకరు గౌరవం ఇచ్చుకుంటే పిల్లలకు కూడా అదే అలవాటు అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎదుటివారి ఎమోషన్స్ ను వారి పరిస్థితిలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. దానివల్ల ఎదుటి వ్యక్తులకు గౌరవం ఇచ్చినట్టు అవుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఏ జెండర్ అయినా సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. సమానంగా చూడాలని కోరారు. అవసరమైతే సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసినా తప్పుగా ప్రవర్తించిన ఏదైనా సమస్యలో చిక్కుకున్న దాన్ని బయటకు చెప్పి ఒప్పుకునే మనస్తత్వాన్ని పిల్లల్లో పెంచాలని ఆయన సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో అన్నిటినీ అంగీకరించే మానసిక సామర్థ్యం పెరుగుతుందని ఆయన చెప్పారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఇంటి నుండే నేర్పించాల్సిన విషయాల్ని ఆయన ఒక పద్ధతి ప్రకారం వివరణ చేశారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
5 ఆగస్టు
2024





# జెండర్ ఈక్వాలిటీ కోసం
# ఎస్.వీ.ఎన్ కంకణం

**విద్యార్థుల్లో మొదట మార్పు రావాలని వారితోనే ప్రదర్శనలు**

































ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 5
ఆగస్టు 2024








# గుట్ట ఎస్.వీ.ఎన్‌లో ఘనంగా ఫ్రెండ్ షిప్ డే వేడుకలు

## స్నేహం గొప్పతనాన్ని వివరించిన ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ మరియు వండర్ కిడ్స్ ప్లే స్కూల్లో ఫ్రెండ్షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగస్టు నెలలోనే మొదటి ఆదివారం నాడు జాతీయ స్నేహితుల దినోత్సవం గా జరుపుకుంటారు. అందులో భాగంగా ఎస్.వీ.ఎన్ మరియు వండర్ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు తమకు ఇష్టమైన స్నేహితులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్లను కట్టి తమ ఆనందాన్ని వ్యక్తపరిచే కార్యక్రమం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఫ్రెండ్షిప్ డే రోజున ఎన్నో రకాల వస్తువులు బహుమతులుగా ఇస్తుంటారు... అయితే ఎస్.వీ.ఎన్ లో చిన్నారులతో ఫ్రెండ్షిప్ బ్యాండ్లను ఒకరినొకరు బహూకరించుకుంటూ హ్యాపీ ఫ్రెండ్షిప్ డే అంటూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, డైరెక్టర్ వృతిక్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ మాట్లాడుతూ స్నేహ పూర్వకమైన విలువలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. స్నేహానికి ప్రాంత భేదం లేదని, బంధుత్వం కన్నా స్నేహం గొప్పదని వివరించారు. స్వార్థం లేని స్నేహం యొక్క గొప్పతనాన్ని ఆయన వివరించారు. స్నేహం ఆనందాన్ని, అనుబంధాన్ని పెంచుతుందని, మల్లెల కన్నా తెల్లనిది, మంచు కన్నా చల్లనిది, బాధల నుంచి విముక్తి కలిగించేది స్నేహం అని వివరించారు. ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు సాహితీ ఉమారాణి, భార్గవి, లావణ్య, జ్యోతి, శిరీష తదితరులు విద్యార్థులను ఫ్రెండ్షిప్ డే సందర్భంగా చక్కగా ముస్తాబు చేశారు.





























ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 5
ఆగస్టు 2024



# భారత్‌కు శ్రీలంక షాక్

## ఆరు వికెట్లతో చెలరేగిన లంక స్పిన్నర్.. రెండో వన్డేలో భారత్ ఓటమి




కొలంబొ వేదికగా జరిగిన శ్రీలంక, భారత్ మధ్య జరిగిన రెండో వన్డేలో లంక బౌలర్లు భారత్‌కు షాక్ ఇచ్చారు. అతి తక్కువ లక్ష్యాన్ని చేధించడంతో భారత్ బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. ఓపెనర్లు శుభారంభానిచ్చినా భారత్ 32 పరుగుల తేడాతో ఓటమి చెందింది. శ్రీలంక బౌలర్ జెఫ్రీ వాండర్సే స్పిన్ మాయాజాలంతో భారత్ 208 పరుగులకే ఆలౌటైంది. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో శ్రీలంక 1-0తో అధిక్యంలో. దీంతో మూడో వన్డేలో భారత్ గెలిచినా వన్డే టోర్ని టైగా ముగుస్తుంది. శ్రీలంక గెలిస్తే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఆగష్టు7న కొలంబొ వేదికగా మూడో మ్యాచ్ జరగనుంది. మొదటి వన్డే, రెండో వన్డేలోనూ రెండు జట్లు స్వల్ప స్కోర్‌కే పరిమితమయ్యాయి. మొదటి వన్డేలో శ్రీలంక, భారత్ 230 పరుగులు చేయడంతో ఆ మ్యాచ్ టైగా ముగిసింది. రెండో మ్యాచ్‌లో శ్రీలంక 240 పరుగులు చేయగా.. భారత్ 208 పరుగులకే ఆలౌటైంది.

### టాస్ గెలిచి..

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఖాతా తెరవకుండానే శ్రీలంక ఓపెనర్ నిషాంక వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అవిష్క ఫెర్నాండో, కుషాల్ మెండిస్ మంచి భాగస్వామ్యం నెలకొల్పడానికి తోడు చివరిలో కె మెండిస్ 40, దునిత్ వెల్లలాగే 39 పరుగులతో రాణించడంతో లంక 240 పరుగులు చేయగలిగింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్ 2, సిరాజ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ తీసుకున్నారు.

### వేగంగా ఆడి..

241 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభమన్ గిల్ మంచి ఆరంభాన్నిచ్చారు. రోహిత్ 44 బంతుల్లో 64, గిల్ 44 బంతుల్లో 35 పరుగులు చేశారు. ఆ తర్వాత అక్షర పేటల్ 44 బంతుల్లో 44 పరుగులు చేశాడు. ఈ ముగ్గురు మినహా మిగతా బ్యాట్స్‌మెన్ పెద్దగా రాణించలేదు. కేవలం 15 పరుగులలోపే మిగిలిన ఆటగాళ్లు ఔటయ్యారు. వాషింగ్టన్ సుందర్ 15, కోహ్లి 14 పరుగులు మినహా మిగిలిన బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. దీంతో 42.2 ఓవర్లలో 208 పరుగులకే భారత్ ఆలౌటైంది.

### వారెవా.. వాండర్సే

కొలంబో: ఎట్టకేలకు భారత జట్టుపై శ్రీలంక పైచేయి సాధించింది. టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురై.. తొలి వన్డేను టై చేసుకున్న ఆతిథ్య జట్టు రెండో మ్యాచ్‌లో మాత్రం ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్ అనిపించుకుంది. ముందుగా బ్యాటర్లు సమష్టిగా రాణించగా.. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే (6/28) గూగ్లీ బంతులకు భారత స్టార్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. కెప్టెన్ అసలంక (3/20) మిగతా ఆటగాళ్ల పనిపట్టడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. తద్వారా సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఆఖరి వన్డే బుధవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సిరాజ్ వికెట్ తీసినా.. ఆరంభంలో ఓపెనర్ ఫెర్నాండో (40), కుశాల్ (30)లతో పాటు చివర్లో కమిందు (40), వెల్లలగె (39) ఆటతో సవాల్ విసిరే స్కోరందుకుంది. సుందర్‌కు మూడు, కుల్దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 42.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు రోహిత్ (64), గిల్ (35) తొలి వికెట్‌కు 97 పరుగులు జోడించినా.. ఆ తర్వాత అక్షర్ (44) మినహా అంతా విఫలమయ్యారు. వాండర్సే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

### సంక్షిప్త స్కోర్లు:

శ్రీలంక: 50 ఓవర్లలో 240/9 (కమిందు మెండిస్ 40, ఫెర్నాడో 40, వెల్లలగె 39, కుశాల్ 30బీ సుందర 3/30, కుల్దీప్ 2/33)బీ
భారత్: 42.2 ఓవర్లలో 208 ఆలౌట్. (రోహిత్ 64, గిల్ 35, అక్షర్ 44బీ వాండర్సే 6/33, అసలంక 3/20).

## వివాదాస్పద బాక్సర్‌కు పతకం ఖరారు

పారిస్: శరీరంలో పురుష లక్షణాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అల్జీరియా, తైవాన్ బాక్సర్లు ఇమేని ఖెలీఫ్, లిన్ యు టింగ్ దూసుకెళుతున్నారు. ఇప్పటికే ఇమేని పతకం ఖాయం చేసుకోగా.. ఆదివారం జరిగిన మహిళల 57 కేజీల విభాగం క్వార్టర్స్‌లో లిన్ 5-0తో స్వెట్లానా కమెనోవా (బల్గేరియా)ను ఓడించి సెమీసకు వెళ్లింది. దీంతో తను కూడా కెరీర్‌లో తొలి ఒలింపిక్ మెడల్ అందుకునేందుకు సిద్ధమైంది. సెమీస్‌లో ఓడినా ఆమెకు కాంస్యం దక్కుతుంది. టెస్టోస్టెరోన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉందనే కారణంతో గతేడాది ప్రపంచ మహిళా చాంపియన్‌షిప నుంచి ఇమేని, లిన్ యులపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే పారిస్ గేమ్స్‌లో ఆడుతుండడంపై వీరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## జొకో సాధించాడు

### సెర్బియా దిగ్గజానికి సింగిల్స్ స్వర్ణం
### ఫైనల్లో అల్కారజ్ చిత్తు



రెండు దశాబ్దాల ప్రొఫెషనల్ కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్‌లు.. లెక్కలేనన్ని టూర్ టైటిళ్లు.. కానీ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఒలింపిక్ స్వర్ణ పతకం అందని ద్రాక్షగానే మిగిలింది. పైగా వయసు 37. వెంటాడుతున్న గాయం బెడద. జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్‌ల్లో ఒక్కటీ దక్కని బాధ. మరోవైపు స్పెయిన్ కుర్రాడు అల్కారజ్ రూపంలో పొంచివున్న ప్రమాదం. ఇన్ని ప్రతికూలతల నడుమ జొకో అనుకున్నది సాధించాడు. ఒలింపిక్స్ స్వర్ణంతో తన కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్నాడు. అలాగే అరుదైన గోల్డెన్ స్లామ్ (4 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతోపాటు ఒలింపిక్స్ సింగిల్స్ స్వర్ణం) కూడా అందుకున్నాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన సింగిల్స్ తుది పోరులో జొకో 7-6 (3), 7-6 (2)తో అల్కారజ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో నొవాక్ కాంస్యం సాధించాడు. తర్వాతి మూడు విశ్వక్రీడల్లో తీవ్రంగా ప్రయత్నించినా స్వర్ణం అందుకోలేకపోయాడు. ఎట్టకేలకు కెరీర్ చరమాంకంలో పసిడి పతకంతో తన కలను జొకో నెరవేర్చుకున్నాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





## కిల్లర్ లుక్ లో పాండే బ్యూటీ పేంపరింగ్!

%-%అర్జున్ రెడ్డి%-% హిట్ తో తారాజువ్వలా దూసుకొచ్చిన షాలినీ పాండే జాడిప్పుడు టాలీవుడ్ లో ఎక్కడా కనిపించని సంగతి తెలిసిందే. నాలుగేళ్ల క్రితం నిశబ్దం సినిమాలో కనిపించింది. ఆ తర్వాత మళ్లీ అమ్మడు పత్తా లేదు. బాలీవుడ్ లో అడపాదడపా సినిమాలు చేస్తోంది గానీ అక్కడా సరైన సక్సెస్ రాలేదు. ఇటీవలే రెండేళ్ల గ్యాప్ అనంతరం %-%మహారాజ్%-% సినిమా చేసింది. ఆ తర్వాత మళ్లీ ఇంతవరకూ కొత్త ప్రాజెక్ట్ ప్రకటించింది లేదు. కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. కానీ స్టార్ కిడ్స్ వేవ్ కారణంగానూ కొన్ని అవకాశాలు కోల్పోతుంది. ఆ మధ్య షాలిని పాండే నటించాల్సిన సినిమా అన్యన్యా పాండే తన్నుకుపోయింది. ట్యాలెంట్ ఉన్నా? ఆ రకంగా కొన్ని అవకాశాలు కోల్పోతుందనే ప్రచారం ఉంది. ఇక అమ్మడి సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. సినిమాలతో సంబంధం లేకుండా ఇన్ స్టాలో మాత్రం కుర్రాళ్లను హీటెక్కిస్తుంది. హాట్ ఫోటోలతో సెగలు పుట్టిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో నాకెవ్వరూ సాటి అంటూ పోటీ పడుతుంది. తాజాగా సొగసరి మరో న్యూ ఫోటోతో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బ్లాక్ కలర్ వింటర్ కోట్ లో దర్శన మిచ్చింది. అమ్మడు స్టైలిష్ గా దిగిన ఓ సెల్ఫీని పోస్ట్ చేసింది. ముఖానికి లైట్ మ్యాకప్.. హెయిర్ స్టైల్.. కిల్లర్ లుక్ ఇంట్రెస్టింగ్. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. షాలినీ పాండే అభిమానులు లుక్ పై ఎవరి స్టైల్లో వారు కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. లుక్స్ గార్జియస్, బ్యూటీఫుల్, క్యూట్ బేబి అంటూ పొగిడేస్తున్నారు. ప్రత్యేకంగా విజయ్ దేవరకొండ %-%అర్జున్ రెడ్డి%-%లో బేబి అని పిలవడాన్ని చాలా కాలానికి అభిమానులు గుర్తు చేసారు. ఇలా అమ్మడు ఇన్ స్టాలో అభిమానులకు రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది.


## తమిళంలో బంపరాఫర్.. కార్తీ సరసన మాళవిక మోహనన్

మలయాళం, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఆమె తమిళంలో కార్తీ సరసన కథానాయికగా నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్-2' ఇటీవలే ప్రారంభమైంది.పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో జరుగుతున్నది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, కథాగమనంలో మాళవిక మోహనన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.

## ఎర్ర ఫ్రాకులో కుర్ర బ్యూటీ గుండెలు దడదడ

బాలీవుడ్ లో నటవారసురాళ్ల హవా గురించి తెలిసినదే. ఇటీవల 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తో నలుగురు నటవారసులు రంగ ప్రవేశం చేయగా, కింగ్ ఖాన్ షారూఖ్ వారసురాలు సుహానా ఖాన్ అందులో ఒకరు. సుహానా తదుపరి పాపా షారూఖ్‌తో కలిసి భారీ యాక్షన్ అడ్వెంచర్ లో నటిస్తోంది. మరోవైపు సుహానా తన ఫ్యాషన్ గేమ్‌ని పూర్తిగా మార్చేసింది. ఇటీవల తనలోని హాలి యాంగిల్ ని ప్రదర్శించేందుకు ఈ అప్ కమింగ్ బ్యూటీ ఏమాత్రం సంకోచించడం లేదు. నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో అంతర్జాలంలో అగ్గి రాజేస్తోంది.

సుహానా తాజాగా రెడ్ హాట్ డ్రెస్‌లో వీకెండ్ వైబ్స్‌ని ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. ఈ బ్యూటీ ఇప్పటికి వన్ ఫిలిం వండర్. కానీ జెన్ జెడ్ ఫ్యాషన్ ఐకాన్ గా యూత్ లో వెలిగిపోతోంది. ఇటీవలి ఫోటో షూట్ కోసం ఖాన్ డాటర్ డేవిడ్ కోమా రెడ్ డ్రెస్‌లో డేట్ నైట్ ని ప్లాన్ చేసింది. ఈ దుస్తులలో స్పఘెట్టి పట్టీలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. సుహానా రెడ్ ఫ్రాకులో హొయలు పోతూ ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చిన వైనం నెట్ లో అగ్గి రాజేస్తోంది. యు-ువతరం వాట్సాపుల్లో ఈ ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. సుహానా తండ్రికి తగ్గ తనయగా నటనారంగంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. దానికి తగ్గట్టే యూత్ కి కిక్కిచ్చే ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. సోషల్ మీడియాల్లో ఈ భామకు భారీగా ఫాలోయింగ్ పెరుగుతోంది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986